





పెద్దాయనకు దక్కిన గౌరవం : ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఇలా ప్రమాణ స్వీకారం చేయించారు. 174 మంది శాసనసభ్యులతో ఆయన ప్రమాణస్వీకారం చేయిస్తారు..



అనే నేను..

నేడు కూటమి ప్రభుత్వ తొలి అసెంబ్లీ

- ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల
- ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
- మూడు జిల్లాల్లో 21 మంది
- రంప నుంచి ఒకరు
- వీరిలో 12 మంది కొత్తవారే
- ముగ్గురికి మంత్రి పదవులు
- డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్
- 10 మందికి మళ్లీ ఛాన్స్
- అందరూ కూటమి సభ్యులే

(రాజమహేంద్రవరం/కాకినాడ/అమలాపురం - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఏర్పడిన తర్వాత తొలిసారిగా అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలందరితో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. దీనికోసం ముందుగా ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇక 21, 22వ తేదీల్లో జరిగే రెండు రోజుల సమావేశాలను గోరంట్ల బుచ్చయ్యచౌదరి నిర్వహిస్తారు. శుక్ర, శని వారాల్లో మొత్తం 174 మంది ఎమ్మెల్యేలతోనూ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేత కూడా ఆయన ప్రమాణ స్వీకారం చేయిస్తారు. 22న రాష్ట్ర స్పీకర్‌ను ఎన్నుకున్న తర్వాత ఆయన బాధ్యత తీరిపోతుంది. ఏడు సార్లు అసెంబ్లీకి ఎన్నికైన గోరంట్ల బుచ్చయ్యచౌదరికి గౌరవంగా ఈ అవకాశం దక్కింది. రాజమండ్రి సిటీ నుంచి నాలుగు సార్లు, రాజమండ్రి రూరల్ నుంచి మూడు సార్లు గోరంట్ల శాసనసభ్యుడిగా ఎన్నికైన సంగతి తెలిసిందే. గతంలో మంత్రిగా కూడా పనిచేశారు.ఏ ప్రాధాన్యతా క్రమంలో అసెంబ్లీలో ప్రమాణ స్వీకారాలు ఉంటాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ముగ్గురు మంత్రులూ బాధ్యతల్లోకి..

కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇందులో పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణ శాఖల మంత్రిగా ఇప్పటికే బాధ్యతలు స్వీకరించగా, నిడదవోలు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కందుల దుర్గేష్ టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగాను, రామచంద్రపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన వాసంశెట్టి సుభాష్ కార్మిక శాఖా మంత్రిగాను గురువారం బాధ్యతలు స్వీకరించారు.అయితే వీరు ముగ్గురితో కూడా శాసనసభలో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

తూర్పుగోదావరి నుంచి...

నిడదవోలు జనసేన ఎమ్మెల్యే కందుల దుర్గేష్‌కు మంత్రి పదవి దక్కిన సంగతి తెలిసిందే. ఆయన గురువారం సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం నగర నివాసి అయిన మంత్రి దుర్గేష్ తాత పోతుల వీరభద్రరావు రాజమండ్రి సిటీ ఎమ్మెల్యేగానూ, మున్సిపల్ ఛైర్మన్‌గా పలు దఫాలుగా పనిచేశారు. దుర్గేష్ అసెంబ్లీలోకి తొలిసారి ప్రవేశిస్తున్నారు. ఎమ్మెల్సీగా గతంలో శాసనమండలిలో ఆరేళ్లపాటు ఉన్నారు. ఆయన రాజమహేంద్రవరం సిటీకి చెందిన నాయకుడైనప్పటికీ నిడదవోలు నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలవడంతోపాటు మంత్రి పదవి కూడా దక్కించుకోవడంతో ఎక్కువ దృష్టి ఆయనకు నిడదవోలు మీదే ఉంటుంది. త్వరలో అక్కడ సొంతిల్లు కూడా ఏర్పాటు చేసుకోనున్నారు. ఇక కొవ్వూరు నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన ముప్పిడి వేంకటేశ్వరరావు రెండోసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. 2014లో ఆయన గోపాలపురం నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలిచి అసెంబ్లీకి వెళ్లారు. ఇవాళ కొవ్వూరు నుంచి గెలిచారు. అనపర్తి నుంచి కూటమి తరపున బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కూడా రెండోసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్లిన రామకృష్ణారెడ్డి ఈసారి పొత్తువల్ల అనూహ్యంగా బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యే అయ్యారు. ఆయన ఈసారి బీజేపీ ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగు పెడుతున్నారు. జిల్లాలో ఏడుగులు ఎమ్మెల్యేలకు గాను నలుగురు తొలిసారి అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు. నిడదవోలు నుంచి కూటమి తరపున గెలిచిన రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి సిటీ టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. 2019లో వైసీపీ సునామీలో కూడా ఆయన సతీమణి ఆదిరెడ్డి భవానీ టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన సంగతి తెలిసిందే. ఆయన తండ్రి అప్పారావు ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన తల్లి రాజమండ్రి కార్పొరేషన్ తొలి మేయర్. రాజానగరం నుంచి జనసేన ఎమ్మెల్యేగా ఎన్నికైన బత్తుల బలరామకృష్ణ తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. ఇక గోపాలపురం నుంచి టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కూడా తొలిసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు.

కాకినాడ జిల్లా నుంచి..

ఎన్నికల అనంతరం అసెంబ్లీ శుక్రవారం కొలువుతీరనున్నది. కాకినాడ జిల్లా నుంచి నలుగురు శాసనసభ్యులు తొలిసారి సభలో అడుగుపెట్టనున్నారు. ఇప్పటికే పిఠాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బాధ్యతలు స్వీకరించి శాఖాపరంగా విజయవాడలో సమీక్షలు నిర్వహిస్తున్నారు. కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, యనమల దివ్య, వరుపుల సత్యప్రభ, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ జిల్లా నుంచి అమరావతికి తరలివెళ్లారు. జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఉండగా, ఇందులో పిఠాపురం నుంచి జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అసెంబ్లీకి ఎన్నికకావడం ఇదే తొలిసారి. 2014 ఎన్నికల ముందు జనసేన పార్టీ స్థాపించిన పవన్ 2019 ఎన్నికల్లో పోటీచేసినా విజయం సాధించలేకపోయారు. ప్రస్తుత ఎన్నికల్లో రికార్డుస్థాయి మెజార్టీతో విజయం సాధించడమే కాకుండా తన పార్టీ తరపున పోటీ చేసిన 21 మంది శాసనసభ్యులుగా ఎన్నికకావడంతో విజయదరహాసంతో సభలో అడుగుపెట్టనున్నారు. అసెంబ్లీలో రెండో అతి పెద్ద పార్టీగా జనసేన ఉండనుంది. ప్రత్తిపాడు నుంచి వరుపుల సత్యప్రభ, తుని నుంచి యనమల దివ్య, కాకినాడ రూరల్ నుంచి పంతం నానాజీ తొలిసారి సభలో అడుగుపెట్టనున్నారు. సత్యప్రభ భర్త రాజా గత ఎన్నికల్లో పోటీచేసినా విజయం సాధించలేకపోయారు. రాజా ఆకస్మిక మరణంతో రాజకీయాల్లోకి వచ్చిన సత్యప్రభ తాను పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే విజయం సాధించారు. అదే విధంగా మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కుమార్తె అయిన దివ్య తొలి ఎన్నికల్లోనే గెలుపును సొంతం చేసుకున్నారు. పలుసార్లు ఎన్నికల్లో పోటీ చేసి విజయతీరాలకు చేరలేకపోయిన జనసేన నేత పంతం నానాజీ ఈసారి మాత్రం జిల్లాలోనే రికార్డుస్థాయి మెజార్టీతో కాకినాడ రూరల్ నుంచి గెలుపొందారు. ఇప్పటికే పలుసార్లు ఎమ్మెల్యేలుగా పనిచేసిన కాకినాడ, జగ్గంపేట ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు), జ్యోతుల నెహ్రూలు మరోమారు అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. పెద్దాపురం నుంచి వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నిమ్మకాయల చినరాజప్ప అసెంబ్లీకి వెళ్లనున్నారు.

కోనసీమ జిల్లా నుంచి..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఈసారి ముగ్గురు ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. వీరిలో వాసంశెట్టి సుభాష్ తొలిసారిగా ఎమ్మెల్యేకావడంతో పాటు అనూహ్యంగా మంత్రిగానూ బాధ్యతలు స్వీకరించారు. జనసేన నుంచి రాజోలులో పోటీచేసి గెలిచిన దేవ వరప్రసాద్ కూడా తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. వరప్రసాద్ సీనియర్ ఐఏఎస్. పి.గన్నవరం నుంచి జనసేన ఎమ్మెల్యేగా గెలిచిన గిడ్డి సత్యనారాయణ తొలిసారిగా ఎమ్మెల్యేగా అసెంబ్లీ మెట్లు ఎక్కను న్నారు. సత్యనారాయణ కూడా పోలీసుశాఖలో అధికారిగా పనిచేశారు. ఇక మండపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వేగుళ్ల జోగేశ్వరరావు వరుసగా నాలుగో సారి శాసనసభ్యుడిగా అడుగుపెడుతున్నారు. కొత్తపేటనుంచి ఎమ్మెల్యేగా మరోసారి ఎన్నికైన బండారు సత్యానందరావు కూడా నాలుగో సారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. అమలాపురం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన అయితాబత్తుల ఆనందరావు రెండోసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతుండగా, ముమ్మిడివరం నుంచి ఎమ్మెల్యేగా ఎన్ని కైన దాట్ల బుచ్చిబాబు మూడోసారి అసెంబ్లీలోకి అడుగు పెడుతున్నారు. జిల్లాలో మొత్తం ఏడు నియోజకవర్గాలకు నలుగురు సీనియర్లు, ముగ్గురు తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు.

రంపచోడవరంలోనూ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోకి రంపచోడవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన మిరియాల శిరీషాదేవి కూడా తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న ఈమె ఏకంగా అసెంబ్లీలోకి టీడీపీ ఎమ్మెల్యేగా అడుగుపెడుతుండడం విశేషం.

కొత్త ఎమ్మెల్యేలదే హవా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా చూసినా, కొత్తగా ఏర్పడిన మూడు జిల్లాల పరిధిలో చూసినా తొలిసారిగా ఎమ్మెల్యేలుగా అడుగుపెడుతున్న వారే అధికంగా ఉండడం విశేషం. మూడు జిల్లాల నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండగా, వీరంతా మొదటిసారి అసెంబ్లీలోకి అడుగు పెడుతున్నవారే. కాకినాడ జిల్లా నుంచి తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ రూరల్ నుంచి ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగు పెడుతుండగా, అటు రంపచోడవరం నుంచి ఎమ్మెల్యే తొలిసారిగానే అడుగుపెడతారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లానుంచి రామచంద్రపురం, పి.గన్నవరం, రాజోలు నుంచి కొత్తవారే అసెంబ్లీలోకి అడుగుపెడుతుండగా, తూర్పుగోదావరి జిల్లానుంచి రాజమండ్రి సిటీ, రాజానగరం, నిడదవోలు, గోపాలపురం ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీ మెట్లు ఎక్కుతున్నారు. మూడు జిల్లాల్లో 21 నియోజకవర్గాలు, అటు రంపచోడవరం నియోజకవర్గం మొత్తం 22 మందిలో 12 మంది కొత్తవారే, పది మంది సీనియర్లు.



మంత్రి కందుల దుర్గేష్‌కు అభినందనలు తెలుపుతున్న శేషారావు

నా శాఖకు వన్నె తెస్తా : దుర్గేష్

నిడదవోలు, జూన్ 20: మంత్రిగా నా శాఖకు వన్నె తెస్తానని రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.అమరావతిలో గురువారం సాయంత్రం 5.51 గంటలకు ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన వెంట కుమారుడు డాక్టర్ కందుల కృష్ణతేజ, డాక్టర్ సుస్మిత, అల్లుడు ఈలి సత్యేంద్ర, కుమార్తె ఈలి శ్రీరంగప్రియ ఉన్నారు.అనంతరం కందుల దుర్గేష్‌కు నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు శుభాకాంక్షలు తెలిపారు.నిడదవోలు నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచిన కందుల దుర్గేష్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు.లండన్ నుంచి ఫోన్ చేసి డాక్టర్ తోపరాల కల్యాణ్ చక్రవర్తి అభినందనలు తెలిపారు.సిటీకేబుల్ ఎండీ నీలం నాగేంద్ర ప్రసాద్, ఆనందం వెంకటేశ్వర్లు, జనసేన నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ భోగవల్లి ప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు.



అసెంబ్లీలోని తన చాంబర్‌లో తల్లిదండ్రులు, భార్య పిల్లలతో మంత్రి వాసంశెట్టి సుభాష్



చాంబర్‌లో మంత్రిగా తొలిసంతకం పెడుతున్న సుభాష్

కార్మికుడిగా పని చేస్తా : సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 20: కార్మికుల సంక్షేమానికి తాను కూడా ఒక కార్మికుడిగా పని చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా వాసంశెట్టి సుభాష్ చెప్పారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వేదపండి తుల మంత్రోచ్ఛరణల నడుమ చాంబర్‌లోకి ప్రవేశించారు. సతీమణి లక్ష్మీసునీత, కుమార్తెలు, తల్లిదండ్రులతో కలిసి పూజలు జరిపారు. ఉదయం 7.34 గంటలకు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం సుభాష్ విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమ పథకాలు 13 తొలగించిందన్నారు. కార్మికుల సంక్షేమం టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. ఈఎస్‌ఐ ఆసుపత్రుల్లో కేంద్ర ప్రభుత్వం వేతనాలు ఇచ్చే పోస్టులను కూడా భర్తీ చేయలేదన్నారు.జిల్లావ్యాప్తంగా టీడీపీ,జనసేన, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు సచివాలయానికి తరలివెళ్లారు.మంత్రి సుభాష్‌కు జనసేన రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మ న్ కట్టా నాగేశ్వరరావు, కౌన్సిలరు అంకం శ్రీనివాస్, పట్టణ శాఖ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ, టీడీపీ నాయకుడు మేడిశెట్టి శేషారావు, మాజీ ఎంపీటీసీ విత్తనాల వెంకటరమణ, మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, కడియాల రాఘవన్, నందూరి ఫణికుమార్, పితాని వీరభద్రరరావు, పెంకె సాంబశివరావు, కంచుమర్తి బాబూరావు, నెం.1 బాబు శుభాకాంక్షలు తెలిపారు.







బొమ్మూరులోని కలెక్టరేట్ వెనుక ముస్తాబైన సైన్స్ మ్యూజియం

పవన్..పవర్

- బొమ్మూరు సైన్స్ మ్యూజియం త్వరలో ప్రారంభం
- డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో కదలిక

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎట్టకేలకు సైన్స్‌మ్యూజియం ప్రారంభం కానుంది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, సైన్స్ అండ్ టెక్నాలజీ, పంచాయతీరాజ్, గ్రామీణనీటి సరఫరాశాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అధికారుల్లో కదలిక వచ్చింది. గత పుష్కరాల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అప్పటి ఎంపీ మాగంటి మురళీమోహన్ చొరవతో రాజమహేంద్రవరానికి సైన్స్ మ్యూజియం మంజూరైంది. రూ.16.82 కోట్లు కేటాయించారు. మొదట స్థల సేకరణ జాప్యమైంది. ఆ తరువాత బొమ్మూరులోని మహిళా ప్రాంగణం పక్కన ప్రధాన రహదారిని అనుకుని ఐదెకరాల స్థలంలో కేంద్రం, రాష్ట్రం సమాన భాగస్వామ్యంతో దీన్ని నిర్మించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఏపీసీఓఎస్‌టీ) ఆధ్వర్యంలో కలకత్తాలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం(ఎన్‌సీఎస్‌ఎం) ఆధ్వర్యంలో ఇది జరిగింది. 2017లో మంజూరు కాగా 2018, ఫిబ్రవరి 18న శంకుస్థాపన చేశారు. 2019, జనవరిలో పనులు ఆరంభమయ్యాయి. బెంగళూరు కంపెనీ పనులు చేసింది. విద్యార్థులకు సైన్స్‌పరంగా బాగా ఉపయోగపడేలా విజ్ఞాన కేంద్రాన్ని తీర్చిదిద్దారు. భవనం, పార్కులు తీర్చిదిద్దారు. కానీ సైట్ ఫిల్లింగ్ చేయకుండా రోడ్డుకంటే పల్లం ప్రాంతంలో దీన్ని నిర్మించడం విమర్శలకు దారి తీసింది. టీడీపీ హయాంలో మురళీమోహన్ కచ్చితంగా మెరక చేయాలని చెప్పారు. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడంతో, అధికారంలోకి వచ్చిన వైసీపీ కనీసం దీన్ని పట్టించుకోలేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడింది. నిర్మాణం పూర్తయినా ప్రారంభించకుండా వదిలేశారు. తిరిగి పవన్ చొరవతో త్వరలోనే ఇది ప్రారంభం కానుంది.

ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం కావాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 20: సక్రమమైన కార్యాచరణ ప్రణాళికతో ఖరీఫ్ సీజన్ 2024కు సన్నద్ధం కావాలని కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఖరీఫ్ సీజన్ 2024కు సన్నద్ధతపై కలెక్టర్ జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో 97,543 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, పత్తి, చెరుకు పంటలను సాగు చేస్తున్నారన్నారు. వివిధ సొసైటీలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువులు, స్టాక్ పాయింట్ల ద్వారా పంపిణీ, భవిష్యత్తు అవసరాలు, విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలు, సీసీఆర్సీ కార్డుల పంపిణీ, పొలంబడి ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయకుమార్, పెద్దాపురం, పిఠాపురం, కరప, తుని, జగ్గంపేట అదనపు వ్యవసాయ అధికారులు, వివిధ మండలాల వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

కొంచెం మద్దతు

- ధాన్యం మద్దతు ధర సాధారణ రకం రూ.117 పెంచిన కేంద్రం
- గ్రేడ్-ఏ రకం రూ.2,320, సాధారణ రకం రూ.2,300
- ఈ ఖరీఫ్ సీజన్‌నుంచి కొనుగోలుకు పౌరసరఫరాలశాఖ సిద్ధం

సామర్లకోట, జూన్ 20: ధాన్యానికి కనీస మద్దతు ధర పెరిగింది. క్వింటాల్‌కు రూ.117 పెరిగింది. గతేడాది గ్రేడ్-ఎ రకం ధాన్యానికి రూ.2,203గా కేంద్రం ప్రకటించగా, ఈ ఏడాది మరో రూ.117 పెంచడంతో రూ.2,320కి చేరింది. సాధారణ రకం ధాన్యం రూ.2,183 ఉండగా ఈ ఏడాది రూ.117తో ప్రకటించడంతో రూ.2,300కి చేరింది. తాజా మద్దతు ధరతో రానున్న ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేసేందుకు వీలుగా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 5.54 లక్షల ఎకరాల పరిధిలో 15లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల ప్రభావం లేకపోతే ఎకరాకు వరికి 4.5మెట్రిక్‌టన్నుల దిగుబడి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం వరికి మద్దతు ధర క్వింటాలుకు రూ.117 పెంచడంతో జిల్లాలో అన్నదాతలకు రూ.250 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. వరి మొక్కజొన్న తదితర 15పంటలకు సంబంధించి మద్దతు ధరలను పెంచుతూ వ్యవసాయ, వ్యయ ధరల కమిషన్(సీఏపీసీ) సిఫారసులతో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పెసలు కనీస మద్దతు ధరను రూ.124 మేర పెంచి రూ.8,682గా నిర్ణయించింది. గతేడాది పెసలు క్వింటాలుకు రూ.8,558గా ఉంది. పెసలపై 12శాతం పెంచగా, వరికి కేవలం 11శాతం మాత్రమే పెంచింది. బుధవారం రాత్రి కేంద్రం నిర్వహించిన(సీఏపీసీ) ఈ పెంపుదల ధరలు వరికే అత్యధికం అని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ పెరిగిన సాగుఖర్చులతో పోలిస్తే ఇది అధికం కాదని పలువురు రైతులు చెబుతున్నారు. ఈ సిఫార్సులను కేంద్ర మంత్రివర్గ ఆమోదంతో సాధారణరకం, గ్రేడ్-ఏ రకాలకు ప్రస్తుతం చెల్లిస్తున్న ధర కంటే రూ.117 చొప్పున పెంచడానికి సన్నాహాలు చేస్తోంది. జిల్లాలో 330 ధాన్యం కొనుగోలు కేంద్రాల వరకూ ఏర్పాటు చేసి ప్రభుత్వం గతంలో ప్రకటించిన మద్దతు ధరకు రైతులనుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. గత ఖరీఫ్‌లో 15.00 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనాలకు అనుగుణంగా కొనుగోలు చేపట్టగా రానున్న ఖరీఫ్ నాటికి 5.54లక్షల ఎకరాలల్లో సాగు ద్వారా వచ్చే 14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ఇక ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.117 మాత్రమే పెంపుదల చేయడంతో రైతాంగం పెదవి విరుస్తోంది. సాగుకు పెట్టుబడులు అధికమవుతున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా మద్దతు ధర లభించడం లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. జిల్లాలో ప్రధానమైన వరిపంటకు కేంద్రం మద్దతు ధర ప్రకటించినా, ఏటా మిల్లర్లు రైతులకు మద్దతు ధర అందివ్వని పరిస్థితి నెలకొంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా మిల్లర్లకు ధాన్యాన్ని అందజేస్తున్నా తమకు మద్దతు కరువవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభిప్రాయం ఎకరాకు సగటున 48బస్తాల వరకూ దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేయగా క్వింటాలుకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర గ్రేడ్-ఏ రకానికి రూ.2,320 ప్రకారం బస్తాకు రూ.1,740 వస్తుంది. మొత్తం 48 బస్తాలకు రూ.83,520 వస్తుంది. కానీ ఎకరానికి పెట్టుబడిగా రూ.70వేల వరకూ పెట్టుబడి వ్యయం అవుతుండగా రైతుకు మిగిలేది రూ.13,520 మాత్రమే. అదే రైతు కూలీ పనులకు వెళ్తే పంట సాగుకాలంలో రూ.75వేలవరకూ వచ్చే అవకాశాలున్నాయి. ఏ-గ్రేడ్ రకానికి మాత్రమే సొంతభూమి సాగు చేసుకునే రైతుకు కొంత మిగులు కనిపించే అవకాశం ఉండగా కౌలురైతు, ప్రభుత్వం ముద్దుగా పిలుచుకునే సాగుహక్కుదారుడు చేతిచమురు వదిలించుకోవాల్సిందే. అన్ని అవరోధాలను దాటుకుని సాగుచేసినా చేతికి మిగిలేది రెండు పదులు దాటని పరిస్థితి. మద్దతు ధర పెరిగితేనే రైతుకు ఎంతో కొంత మిగులుతుంది.

సచివాలయ కార్యదర్శులపై కమిషనర్ ఆగ్రహం

- 11మందికి షోకాజ్ నోటీసులు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 20: విధి నిర్వహణలో సచివాలయ కార్యదర్శుల అలసత్వంపై కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు కొరడా ఝుళిపించారు. బాధ్యతరహితంగా పనిచేస్తున్నారన్న అభియోగంపై 11మంది కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. కాకినాడ గాంధీనగర్ 41డివిజన్ ఏ, బీ సచివాలయాలను గురువారం ఆయన తనిఖీ చేశారు.ఆ సమయంలో అనేక లోపాలను గుర్తించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అడ్మిన్లు, వివిధ విభాగాల సచివాలయ కార్యదర్శుల పని తీరుపై తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెస్‌కోడ్ ఉల్లంఘించడం, సమయపాలన పాటించకపోవడం, రికార్డుల నిర్వహణలో అలసత్వాన్ని గుర్తించారు.అక్కడున్న రికార్డులను తనిఖీ చేయగా అనేక లోపాలు బయటపడడంతో కమిషనర్ మండిపడ్డారు. ఇందుకు బాధ్యులైన ఆరెండు సచివాలయాలకు చెందిన 11మందికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులు విధినిర్వహణలో అలసత్వం వహిస్తే మరిన్ని కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

ఒక యోగం



అమలాపురం రూరల్/ తుని రూరల్:

యోగా... మానవులకు యోగం. మానసిక శుద్ధితో పాటు శారీరక శుద్ధి చేసి మనిషిని ఆరోగ్యవంతంగా ఉంచగలిగే శక్తి యోగాకు ఉంది. యోగాను ఒక యాగంగా భావిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారనడంలో అతిశయోక్తి లేదు.

యోగా భారతీయ సంపద

శారీరక, మానసిక సమస్యలకు పరిష్కార మార్గాలు చూపే అద్భుత క్రియ

నేటి యాంత్రిక జీవనానికి దివ్యౌషధం


యోగాతో అందం..ఆరోగ్యం

ఆరోగ్యం అందాన్ని ఇస్తుంది. అందం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. వీటన్నింటినీ యోగా ప్యాకేజీగా అందిస్తుంది. మహిళలు క్రమం తప్పకుండా యోగా చేస్తే చర్మాన్ని కాంతివంతం చేస్తుంది. శరీరాన్ని సరైన ఆకృతిలో పెడుతుంది. రోజంతా ఉత్సాహంగా, చురుగ్గా ఉంచుతుంది. రుతుక్రమం సరిగ్గా వచ్చేలా చూస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే రోజూ చేసే యోగా మహిళలను స్లిమ్ అండ్ ఫిట్‌గా మారుస్తుంది.

ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానంతో అంతర్గత అవయవాలకు ఉత్తేజం అందుతుంది. తద్వారా రోగాలు పటాపంచలవుతాయి. ఆధునిక వైద్యం దారిచూపని అనేక సమస్యలకు పరిష్కారం చూపే మహత్తు ప్రాచీన భారతీయ యోగాకు మాత్రమే ఉంది. ఒకప్పుడు మహర్షులు, యోగులకు మాత్రమే పరిమితమైన యోగా ఇప్పుడు దైనందిన జీవితంలో భాగమైంది. మారుమూల పల్లెలకు సైతం యోగా విస్తరించింది. జిల్లాలో వందకు పైగా యోగాభ్యాస కేంద్రాలు పనిచేస్తున్నాయి.

మనిషిలోని అంతర్గత శక్తులను చైతన్యం చేసేది యోగా. శరీరంతో పాటు మనోబుద్ధులు అత్యుత్తమ స్థాయిలో పనిచేసేందుకు యోగా దోహదపడుతుంది. యోగం అనే పదానికి కలయిక అని అర్థం. గతంలో లేని దానిని పొందడం.. ఇది వరకు తెలియని దానిని తెలుసుకోవడమే యోగా పరమార్థం. యోగా అంటే ఆసనాలు వేయడం.. శరీరాన్ని అనేక రీతుల్లో వంచడం.. గాలిని బిగబట్టడం.. వంటివిగా భావిస్తారు. ఇవన్నీ యోగశాస్త్రంలో ప్రాథమిక అభ్యాసాలు మాత్రమే. వీటివల్ల శారీరక రుగ్మతలెన్నో దూరం చేసుకోవచ్చు. మానసిక ప్రశాంతతను పొందవచ్చు. ఒత్తిడిని అధిగమించి విజయంవైపు అడుగులు వేయవచ్చు.

ఉరుకుల పరుగుల ఆధునిక జీవన విధానంలో ప్రతిఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల నుంచి ఉద్యోగులు, వ్యాపారులు.. ఇలా అన్ని రంగాల వారు ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడపాల్సిన పరిస్థితి నెలకొంది. తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నవారు ఒక్కోసారి నేరాలకు పాల్పడడం, మరికొందరైతే ఆత్మహత్యాయత్నాలకు పాల్పడడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. మందులకు లొంగని మహమ్మారి ఒత్తిడిని మెలకువతో నియంత్రించే శక్తి యోగాకు ఉంది.



అమలాపురంలో యోగాసనాలు

శారీరక ఆరోగ్యానికి

శరీరం, మనసు ఒకదాంతో ఒకటి ముడిపడి ఉంటాయి. శారీరక ఆరోగ్యమే మిగతా ఆరోగ్యాలకు పునాది. ఎందుకంటే 75 శాతం వ్యాధులకు మనసే కారణమని ఆధునిక పరిశోధనల్లో తేలింది. ఆధునిక జీవన విధానంలో అధిక రక్తపోటు, నిద్రలేమి వంటివెన్నో ఉన్నాయి. సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించేలా పతంజలి మహర్షి యోగాసనాలకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. యోగాలో ఎన్నెన్నో భంగిమలు. ఒక్కొక్కటి ఒక్కో శరీర భాగానికి ఆరోగ్యానిస్తుంది. వజ్రాసనం ఎసిడిటీని రూపుమాపుతుంది. శశాంకాసనం కాలేయ సమస్యలను దరిచేరనివ్వదు. భుజంగాసనం వెన్నునొప్పిని తగ్గిస్తుంది. వజ్రోలి లైంగిక శక్తిని పెంచుతుంది. వీటితో పాటు విద్యార్థులకు ఏకాగ్రతతో పాటు చక్కటి శరీర ఆకృతికి, బరువు తగ్గడానికి, నడుం, మెడ నొప్పి వంటివాటిని తగ్గించుకునేందుకు ఎన్నో ఆసనాలున్నాయి.



రకాలెన్నో..

ప్రాణాయామం చేయడం ద్వారా ప్రాణశక్తి పెరుగుతుందని విశ్వసించే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. అందుకే యోగాభ్యాసం పట్ల మక్కువ పెంచుకుని యోగా శిక్షణా తరగతుల వైపు పరుగులు తీస్తున్నారు. యువ యోగా, పవర్ యోగా, హఠయోగా, అరుణ యోగా.. లాఫింగ్ యోగా, డ్యాన్స్ యోగా, సైంటిఫిక్ యోగా.. ఇలా సరికొత్త రూపాలను సంతరించుకుంటూ "ఆరోగ్య మహాయోగా"న్ని ప్రసాదిస్తోంది. గతంలో ఎన్నడూలేనంతగా యోగాపై జరుగుతున్న ప్రచారంతో సాధన చేసేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ప్రాణాయామానికి ప్రత్యేక స్థానం

యోగశాస్త్రంలో ప్రాణాయామానికి ప్రత్యేక స్థానం ఉంది. పూరక, కుంభక, రేచకాల ద్వారా శ్వాసను క్రమబద్ధీకరిస్తే శారీరక, మానసిక వికాసం సాధ్యం. భస్త్రిక మనసుమీద నియంత్రణ ఇస్తుంది. చెవి, ముక్కు, గొంతు సమస్యల నివారణకు ఉజ్జయి ఉపకరిస్తుంది. నాడీవ్యవస్థ పనితీరును నాడీశోధన మెరుగుపరుస్తుంది.

ఆరోగ్య ప్రదాయిని యోగా

శరీరశుద్ధితో పాటు మానసిక శుద్ధికోసం యోగా పితామహుడు పతంజలి మహర్షి అష్టాంగమార్గాన్ని ప్రజలకు అందించారు. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార ప్రక్రియలు శారీరక శుద్ధికి ఎంతగానో ఉపకరిస్తాయి. ఇక ధారణ, ధ్యానం, సమాధి స్థితి మనసును శుద్ధిచేస్తాయి. వాటిని సాధన చేసే విధానాలను మహర్షి స్పష్టంగా వివరించారు. యోగా భారతీయ సనాతన విద్య. యోగశాస్త్రంలో ఎక్కడా దేవుని ప్రస్తావన ఉండదు. ఒకే ఒక సూత్రంలో మాత్రం సర్వజ్ఞుడైన వ్యక్తి అని మాత్రమే చెప్పారు. యోగా ఏ మత విశ్వాసానికి, ఏదో ఒక దేవునికి సంబంధించినది కాదు. ప్రపంచంలోని ప్రతి మనిషికీ శరీరం, ఇంద్రియాలు, మనసు ఒకటే.

దాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, యోగా గురువు, అమలాపురం



శ్రీప్రకాష్‌లో
యోగా దినోత్సవం

తుని రూరల్, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో యోగా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల యోగాసనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ యోగా ద్వారా జ్ఞాపక శక్తి మెరుగవుతుందని, మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు క్లిష్టమైన ఆసనాలు వేసి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

డాలర్లు దోచేశారు!



స్వాధీనం చేసుకున్న డాలర్లు

అధిక మొత్తం ఆశ చూపి డాలర్లతో ఉడాయించిన ముఠా

ఆరుగురి అరెస్ట్.. మరో ఐదుగురి కోసం గాలింపు

రాజమహేంద్రవరం, జూన్ 20 (ఆంధ్రజ్యోతి) : అమెరికా వెళ్లి డాలర్లు సంపాదించి తెచ్చుకున్నారు. కానీ అత్యాశతో ఓ ముఠా చేతికి దొరికిపోయారు. కేసు వివరాలను అడిషనల్ ఎస్పీ(క్రైమ్స్) టి.సర్కార్ గురువారం వెల్లడించారు. విశాఖపట్నానికి చెందిన వెలగల శివ శంకరరెడ్డి 50 వేల అమెరికన్ డాలర్లను భారత కరెన్సీలోకి మారకం చేసుకునే క్రమంలో విశాఖకు చెందిన కర్రి కనకరాజుతో పరిచయం ఏర్పడింది. తమకు డాలర్లు ఇస్తే భారత కరెన్సీలో డాలరుకు రూ.98 ఇస్తామని ఆశచూపారు. దీంతో బేరం కుదిరింది. మే నెల 30న దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామంలోని జడ్పీ హైస్కూల్ వద్దకు శంకరరెడ్డి డాలర్లు తీసుకొని వెళ్లారు. అక్కడికి కనకరాజుతో పాటు మరో పది మంది వచ్చి డాలర్లు ఉన్న బ్యాగ్‌ని లాక్కుపోయారని అడిషనల్ ఎస్పీ తెలిపారు. ఈ కేసులో విశాఖకు చెందిన కనకరాజు, విజయనగరానికి చెందిన గణగల్ల అజయ్‌కుమార్, అల్లూరి జిల్లా సీలేరుకు చెందిన వంతల విష్ణు, పల్నాడు జిల్లా మల్లాది గ్రామానికి చెందిన సొంగా రమేశ్, విజయవాడకు చెందిన ఉడత రవితో సహా ఆరుగురిని గురువారం అరెస్టు చేసి 36 వేల డాలర్లు, ఇన్నోవా కారు, హోండా అమేజ్ కారు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో ఐదుగురి కోసం గాలింపు చేపట్టామని తెలిపారు. అయితే పోలీసుల వివరణపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇండియన్ కరెన్సీలో సుమారు రూ.41 లక్షలకు సంబంధించిన భారీ నేరం విషయంలో ఏదో దాస్తున్నారనే అనుమానాలు ఉన్నాయి. నిందితులుగా పేర్కొన్న వారిలో అందరూ వివిధ జిల్లాలకు చెందినవాళ్లు. ఉదాహరణకు ఎక్కడో పల్నాడు జిల్లా ఒకరిదైతే ఇక్కడి అల్లూరి జిల్లా మరొకరిది. దీంతో వీళ్లందరూ ముఠాగా ఎలా ఏర్పడ్డారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అలాగే శంకర్ రెడ్డికి అంత పెద్ద మొత్తంలో 50 వేల అమెరికన్ డాలర్లు ఎలా వచ్చాయనే స్పష్టత కూడా కొరవడింది. శంకర్ రెడ్డిది విశాఖ జిల్లా, నిందితులవి వివిధ ప్రాంతాలు. దేవరపల్లిలో దాడి ఎలా జరిగిందో వివరణ లేదు. దీంతో ఈ కేసు విషయంలో నిజాలు బయటకు రావాల్సిన అవసరం కనిపిస్తోంది.



మరమ్మతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఓఎన్జీసీ బావిలో మరమ్మతులు

మలికిపురం, జూన్ 20: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం తూర్పుపాలెం సముద్ర తీరంలోని కేశనపల్లి వెస్ట్ 38 ఓఎన్జీసీ ఆయిల్ కంపెనీ గ్యాస్ బావిలో సాంకేతిక సమస్య తలెత్తింది. ఈ బావి నుంచి కొన్ని రోజులుగా గ్యాస్ రావట్లేదు. దీంతో గురువారం తూర్పుపాలెంలోని సీఎస్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. కేశనపల్లి వెస్ట్ స్ట్రక్చర్ పరిధిలో అత్యధికంగా గ్యాస్ ఉత్పత్తి జరుగుతున్న బావులు ఇక్కడే ఉన్నాయి. రెండేళ్ల క్రితం మరమ్మతులు చేసినప్పుడు భారీ ఎత్తున గ్యాస్ ఆయిల్ లీకై పెను ప్రమాదం తప్పింది. అప్రమత్తమైన ఉన్నతాధికారులు ఈసారి అధునాతన యంత్ర పరికరాలను తెచ్చి బావులను బాగు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



బోరున విలపిస్తున్న భార్య

అంబాజీపేట, జూన్ 20: వ్యవసాయంలో కూలి పని చేసేందుకు వెళ్తున్న ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కముజువారిలంక గ్రామానికి చెందిన విత్తనాల నాగేశ్వరరావు (58) భార్య వెంకటలక్ష్మితో కలిసి గురువారం మధ్యాహ్నం పొలం పనికి బయల్దేరాడు. ఈ సమయంలో ముక్కామల నుంచి కొత్తపేట వైపు వెళ్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు నాగేశ్వరరావును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించగా నాగేశ్వరరావు మృతి చెందినట్టు నిర్ధారించారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అంబాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

రంపచోడవరం, జూన్ 20: బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయికి కాకినాడ స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి కొండపల్లి శ్రీదేవి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షను ఖరారు చేస్తూ తీర్పును వెలువరించినట్లు ఎస్‌ఐ మోహన్ కుమార్ తెలిపారు. అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను రంపచోడరంలో నివాసం ఉంటున్న మద్దికొండ సుధాకర్ మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఏఎస్పీ వకుల్ జిందాల్ ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. కేసులో సాక్ష్యుల వాంగ్మూలం ఆధారంగా జడ్జి కిడ్నాప్ నేరం కింద 6 నెలల సాధారణ జైలుశిక్ష, రూ.1000లు జరిమానా, పోక్సో చట్టం ప్రకారం 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ.5000 జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు కేసును వాదించారు.

దేవదాయ మంత్రిని కలిసిన రత్నగిరి బృందం

అన్నవరం, జూన్ 20: రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిగా గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆనం రాంనారాయణరెడ్డిని అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్ర మోహన్, చైర్మన్ రోహిత్ ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఈవో స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అన్నవరం ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను మంత్రి ఈవోను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, సహాయ కమిషనర్ విశ్వనాథరాజు పాల్గొన్నారు.



మంత్రికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 20: ఆర్థిక అక్షరాస్యతపై సమాజంలో ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన కల్పించడమే ప్రత్యేక శిక్షణ తరగతుల ముఖ్యోద్దేశమని రిజర్వు బ్యాంకు జనరల్ మేనేజర్ ఆర్క్ మహన పేర్కొన్నారు. స్థానిక షెల్టన్ హోటల్‌లో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతి మహిళ ఆర్థిక అక్షరాస్యతపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు, సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు అందజేసే రుణ మంజూరు విధి విధానాలపై ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి అవగాహన కల్పించారు. బ్యాంకులు అందజేసే పథకాలను ఎల్‌డీఎం వివరించారు.

'తూర్పుగోదావరి జిల్లా రాజకీయాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు తదితరులు

దివాన్‌చెరువు, జూన్ 20: తూర్పుగోదావరి జిల్లా రాజకీయాలు 1952-2022 పుస్తకాన్ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1952లో ఎన్నికలు ప్రారంభమైన నాటి నుంచి 2022 వరకూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద జిల్లాగా తూర్పుగోదావరి జిల్లా పేరు పొందిందన్నారు. ఈ జిల్లా రాజకీయాలను నన్నయ విశ్వవిద్యాలయం రాజనీతిశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు బీవీవీ బాలకృష్ణ రచనా సంకలనం చేశారని తెలిపారు. విశ్వవిద్యాలయంలోని అంబేడ్కర్ కేంద్ర గ్రంథాలయంలోని నన్నయ భారతి, నన్నయ అధ్యయన కేంద్రంలోని గ్రంథాలను ఉపయోగించుకుంటూ బాలకృష్ణ ఈ పుస్తక రూపకల్పనకు కృషి చేశారని అభినందించారు. నన్నయ భారతి ద్వారా ఈ పుస్తకాన్ని ప్రచురించినట్లు చెప్పారు. ప్రతులు కావలసిన వారు నన్నయ అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. గత చరిత్రను, ఒకనాటి సంఘటనలను విస్మరించకుండా రాబోయే సమాజానికి అక్షరబద్ధం చేసి ఇవ్వగలిగితే చరిత్రలోని లోటుపాట్లు నేటి సమాజానికి మార్గదర్శకం అవుతాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, రచయిత బీవీవీ బాలకృష్ణ, సహాయకులు నన్నయ భారతి కోఆర్డినేటర్ పి.విజయనిర్మల, ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, అధ్యాపకులు ఆచార్య కేవీ రావు, ఆచార్య నరసింహారావు, కె.రాజరాజేశ్వరీదేవి తదితరులు పాల్గొన్నారు.

'విజయవంతంగా జేఎన్టీయూకే బృందం అమెరికా పర్యటన'

జేఎన్టీయూకే, జూన్ 20: పూర్వవిద్యార్థుల సంబంధాలను మెరుగుపర్చడం ద్వారా ఉన్నతవిద్యనభ్యసించేందుకు అమెరికా వెళ్లే విద్యార్థులకు ఉత్తమ మార్గదర్శకం లభిస్తుందని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. విదేశాల్లో స్థిరపడిన జేఎన్టీయూకే పూర్వవిద్యార్థులను వర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములను చేసేందుకుగాను వారి ఆహ్వానం మేరకు వీసీ ప్రసాదరాజు, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, జేవీఆర్ మూర్తిలతో కూడిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం చేపట్టిన అమెరికా పర్యటన విజయవంతం అయ్యిందన్నారు. అక్కడ చేపట్టిన కార్యక్రమాలను వీసీ వివరించారు. యూఎస్ విశ్వవిద్యాలయాలతో కలిసి ప్రస్తుత సాంకేతికతకు అనుగుణంగా సంయుక్తంగా ఎంఎస్ ప్రోగ్రాంలు నిర్వహించేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. సంయుక్త నిధుల కోసం దరఖాస్తు చేసేందుకు మిస్సోరి వర్సిటీతో చర్చలు జరిపామని, గతంలో ఇదే విశ్వవిద్యాలయంతో పార్టనర్‌షిప్-2020 గ్రాంట్‌ను 2020-22 మధ్య విజయవంతంగా అమలు చేసి అమెరికా ప్రభుత్వం నుంచి ఎక్సలెన్స్ సర్టిఫికెట్ పొందారని అన్నారు. 2015-2019 వరకూ చికాగో స్టేట్ యూనివర్సిటీతో కలిసి ఒబామాసింగ్ ఇనీషియేటివ్ గ్రాంట్స్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. వర్సిటీలో విద్యా వాతావరణాన్ని మరింత మెరుగుపరిచేందుకు కాలిఫోర్నియాకు చెందిన పూర్వవిద్యార్థులు తమవంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. యూనివర్సిటీకి న్యాక్ ఏ+ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించడం విద్యార్థులు మెరుగైన ప్యాకేజీలతో ప్లేస్‌మెంట్స్ పొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశామన్నారు. సీఎస్‌యూతో కలిసి కొలాబొరేటివ్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం నిర్వహించేందుకు సీఎస్‌యూ ఉన్నతాధికారులతో సమావేశమై కోర్సు రూపకల్పనకు చర్చలు జరిపినట్లు తెలిపారు. వర్సిటీ ప్లాటినం జూబ్లీ, అలూమ్ని సెంటర్ నిర్మాణానికి పూర్వవిద్యార్థులనుంచి విరాళాలు సేకరించడంలో కీలకపాత్ర పోషిస్తున్న సీతా, ముత్యాల భాస్కర్‌రావును బృందం తరపున కలిసి కృతజ్ఞతలు తెలిపామన్నారు. పూర్వవిద్యార్థులైన పారిశ్రామికవేత్తలతో సమావేశమై ఏఐలో ఇంటర్న్‌షిప్ అందించేందుకు ముందుకువచ్చిన పూర్వవిద్యార్థి డాక్టర్ వాసును అభినందించినట్లు తెలిపారు.

జేఎన్టీయూకే ఫార్మా డీ ప్రశ్నపత్రంలో గందరగోళం

జేఎన్టీయూకే, జూన్ 20: కాకినాడ జేఎన్టీయూకే పరిధిలో 14 కళాశాలలకు సంబంధించి 12 కేంద్రాల్లో ఫార్మాడీ కోర్సు ద్వితీయ సంవత్సరం పరీక్షలను నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించిన ఫార్మా థెరాప్యూటిక్స్-1 పరీక్షాపేపర్‌లో ఇదే కోర్సుకు సంబంధించిన తృతీయ సంవత్సర సిలబస్‌నుంచి 4 ప్రశ్నలు, 1 బిట్ వచ్చాయని తెలుసుకున్న విద్యార్థులు గందరగోళానికి గురై ఆందోళన చేశారు. విద్యార్థులంతా అధ్యాపకులను ప్రశ్నించగా పరీక్ష ముగిసే అరగంట ముందు 4 ప్రశ్నలు, ఒక బిట్‌ను ద్వితీయ సంవత్సర సిలబస్ నుంచి ఇచ్చి పరీక్షా సమయాన్ని ఒక గంట పెంచారు. దీనిపై వర్సిటీ పరీక్షల విభాగం డీఈ బి.బాలకృష్ణను వివరణ కోరగా ప్రశ్నలు తృతీయ సంవత్సరం సిలబస్ నుంచి రావడం వాస్తవమేనని విద్యార్థులు నష్టపోకుండా సమస్యను వెంటనే గుర్తించి ప్రశ్నలు మార్చి వాటిని రాసేందుకు సమయాన్ని పెంచామని కాబట్టి విద్యార్థులు యథావిధిగా పరీక్షలు రాశారని, వారు ఎలాంటి ఆందోళన చెందనక్కర్లేదని తెలిపారు.

నేడు అంతర్వేదిలో సప్తనదీ జలాల మహా జ్యేష్ఠాభిషేకం

అంతర్వేది, జూన్ 20: అంతర్వేదిలో కొలువైయున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సప్తనదీ జలాల మహా జ్యేష్ఠాభిషేకానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగే ఈ క్రతువులో పాల్గొనదలచిన భక్తులు రూ.400 టిక్కెట్ తీసుకోవాలన్నారు. మహాశాంతి హోమం కూడా జరుపుతామని అర్చకులు చెప్పారు.

యోగా, వెల్‌నెస్ ఫెస్టివల్ ప్యానల్ సభ్యునిగా సాంబశివరావు

అమలాపురం టౌన్, జూన్ 20: ముంబైలో ధార్త్రి, హబీబీటీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా, వెల్‌నెస్ ఫెస్టివల్‌కు దేశ, విదేశాల నుంచి 1200కు పైగా వైద్యులు, ప్రతినిధులు హాజరయ్యారు. 11 మంది సభ్యులతో జాతీయ స్థాయిలో ఏర్పాటుచేసిన ప్యానల్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి అమలాపురం పట్టణానికి చెందిన చిక్కం సాంబశివరావును మాత్రమే ఎన్నుకున్నారు. ఎకో వారియర్స్, లివింగ్ గ్రీన్ ఎవ్రీడే తదితర అంశాలపై సాంబశివరావు జాతీయ స్థాయి సదస్సులో చర్చించారు. లీడ్ ది లైవ్స్ సీఎఫ్ శాంతిస్వరూప్ తదితరులు సాంబశివరావును అభినందించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

అంబేడ్కర్‌కు ఇచ్చే నిజమైన గౌరవం ఇదే

గొల్లప్రోలు, జూన్ 20: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రభుత్వం జగన్ విదేశీ విద్య పథకానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధిగా పేరు మార్చడం పట్ల ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ పిల్లా చంద్రం గురువారం హర్షం వ్యక్తం చేశారు. పేర్లు మార్చడం కోసం కాకుండా రాష్ట్రాభివృద్ధి కోసం అధికారంలో ఉన్న పార్టీలు పనిచేయాలని సూచించారు.

ప్రైవేటు ఆస్పత్రిలో గర్భిణీతోపాటు శిశువు మృతి

● ఆస్పత్రి వద్ద బంధువుల ధర్నా


మృతురాలితో బంధువులు

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 20: కాకినాడ రమ్య ఆస్పత్రి వద్ద గురువారం ఓ గర్భిణీతో పాటు శిశువు కూడా మృతి చెందింది. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మృతురాలి బంధువులు ధర్నా చేశారు. దీంతో అక్కడ కొంత ఉద్రిక్తత నెలకొంది. ఈ విషయమై కాకినాడ టూటౌన్ సీఐను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు ఇప్పటివరకు అందలేదన్నారు.

'మానసిక ప్రశాంతతకు యోగా దోహదం'

పెద్దాపురం, జూన్ 20: ప్రతీఒక్కరిలోనూ మానసిక ప్రశాంతత పెంచేందుకు యోగా దోహదపడుతుందని పెద్దాపురం శ్రీప్రకాష్ పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ అన్నారు. యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం స్థానిక శ్రీప్రకాష్ పాఠశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, ఈషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ప్రతిఒక్కరూ ఒత్తిళ్ళకు గురవుతున్నారని, అటువంటి ఒత్తిళ్ల నుంచి బయటకు వచ్చేందుకు యోగా దోహదపడుతుందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో యోగాసనాలు వేయించి సుమారు గంటన్నర పాటు యోగా సాధన చేశారు. తొలుత భరతమాత, కెబి హెడ్గేవార్, మోహన్ భగవత్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ, చిన్నీప్రసాద్, రవికుమార్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు యోగా దినోత్సవానికి ఏర్పాట్లు

ప్రత్తిపాడు, జూన్ 20: ప్రత్తిపాడు మండలం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ యోగా డేను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మడి వెంకట్రావు చెప్పారు. నేషనల్ యోగా దివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, రాష్ట్ర ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్ చౌదరిలు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని నియోజకవర్గంలోని బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని చేయాలని వెంకట్రావు కోరారు.

మానవ శరీరానికి యోగా మంచిది

కొత్తపల్లి, జూన్ 20: మానవ శరీరానికి యోగా మంచిదని ఉప్పాడకు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు దున్న హరినాధ్ రాజా అన్నారు. శుక్రవారం జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాలో వివిధ భంగిమలతో రూపొందించిన మ్యాప్‌ను ఆయన ఆసుపత్రిలో గురువారం ఆవిష్కరించారు. ప్రతీరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా సాధన చేయాలన్నారు. యోగాతో పాటు ధ్యానంకూడా సాధన చేయాలన్నారు. యోగా సాధన చేయ డం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు.

యోగాతో శారీరక ఆరోగ్యం

సర్పవరంజంక్షన్, జూన్ 20: యోగాతో శారీరక మానసిక ఆరోగ్యం లభిస్తుందని ప్రముఖ యోగా గురూజీ దంగేటి సత్యనారాయణరావు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వలసపాకల, వాకలపూడిలో శ్రీసత్యసాయి ధ్యానమండలి ఆధ్వర్యంలో సామూహిక యోగాభ్యసన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో యువకులు, మహిళలు, రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సేవలందించే రెవెన్యూ వ్యవస్థ

● ఆర్డీవో సీతారామారావు ● ఘనంగా రెవెన్యూ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

పెద్దాపురం, జూన్ 20: ప్రజలందరికీ పారదర్శకంగా సేవలందించే ప్రభుత్వశాఖ రెవెన్యూ వ్యవస్థ అని పెద్దాపురం రెవెన్యూ డివిజినల్ అధికారి జే.సీతారామారావు అన్నారు. మండలంలోని జీ.రాగంపేట గ్రామంలో గురువారం రెవెన్యూ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా మండల డిప్యూటీ తహశీల్దార్ పద్మజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్డీవో సీతా రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికానికి మూలస్తంభాలు రెవెన్యూ శాఖ అన్నారు. అనంతరం రెవెన్యూ సేవలపై వివరించి విశ్రాంత వీఆర్వోలను ఘనంగా సత్క రించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుంగా శేఖర్, ఎంపీటీసీ కాలే అనూరాధ, జల్దాని బాబి, బోస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కరప: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డే వేడుకను అధికారులు ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో పదవీ విరమణ పొందిన పులపకూర అప్పారావు, కాకినాడ ఈశ్వరరావులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. డీటీ కె.అనిల్‌కుమార్, ఆర్ఐ పేపకాయల మాచరరావు, సర్వేయర్ రామకృష్ణ, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట: రెవెన్యూ దినోత్సవాల్లో భాగంగా జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో పాటు పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు. రిటైర్డ్ వీఆర్వో ఈశ్వరరావును, తోటి రెవెన్యూ సిబ్బందిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీ నాగేశ్వరరావుతోపాటు సర్వేరు, వీఆర్వోలు, పంచాయతీ రాజ్ సెక్రటరీ పాల్గొన్నారు.

సామర్లకోట: మండలంలోని గొంచాల గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సామర్లకోట తహశీల్దార్ వై. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలలో ముఖ్యఅతిథిగా కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ తహవీల్దార్ ఆర్. శ్రీనివాస్, వీఆర్వో సుబ్బారావు, వెంకటేశ్వరి, పద్మనాభం తదితర గ్రామ ప్రజాప్రతినిధులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో చిన రాజప్ప ప్రత్యేక పూజలు


సత్యదేవుడి దర్శనం చేసుకుని వస్తున్న చినరాజప్ప

అన్నవరం, జూన్ 20: రత్నగిరి వాసుడైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం మాజీ మంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ఛైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చినరాజప్పకు ఆర్డీవో అభినందన

సామర్లకోట: పెద్దాపురం ఎమ్మెల్యేగా మూడవసారి గెలుపొందిన నిమ్మకాయల చినరాజప్పను అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కాకినాడ రెవెన్యూ డివిజన్‌తో బాటూ సామర్లకోట మండలానికి రెవెన్యూపరంగా అందజేస్తున్న వివిధ సేవలను ఎమ్మెల్యే చినరాజప్పకు వివరించారు. సామర్లకోట తహశీల్దార్ వై.శ్రీనివాస్, డిప్యూటీ తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్ తదితర వీఆర్వోలు పాల్గొన్నారు.

జయలక్ష్మి బ్యాంకు బాధితులకు న్యాయం చేయాలి

● డిపాజిటర్లు, ఖాతాదారులు డిమాండ్

పిఠాపురం, జూన్ 20: రెండున్నర సంవత్సరాల క్రితం బోర్డు తిప్పేసిన జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకులోని డిపాజిట్లు చేసి నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని డిపాజిటర్లు, ఖాతాదారులు డిమాండ్ చేశారు. పిఠాపురంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బ్యాంకు పూర్వ పాలకవర్గం చేసిన నిర్వాకంతో 20వేల మందికి పైగా డిపాజిటర్లు, ఖాతాదారులు రోడ్డున పడ్డారని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం తమ బాధలను పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ద్వారా తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లామని తెలిపారు. జయలక్ష్మి బ్యాంకు బాధితుల ఇబ్బందులపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి కొండబాబులు దృష్టిసారించి తమ డిపాజిట్లు, ఖాతాల్లో ఉన్న సొమ్ములను వెనక్కి ఇప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. యనమండ్ర సూర్యనారాయణ, సీహెచ్. పళ్లంరాజు, ఎం.సుబ్రహ్మణ్యం, శర్మ, ఏ.శారద, ఎం.సుందరి పాల్గొన్నారు.

డయేరియా నియంత్రణకు పటిష్ట చర్యలు

● తుని ఎమ్మెల్యే యనమల దివ్య


డయేరియాపై డిప్యూటీ డీఎంహెచ్‌వోను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దివ్య

తొండంగి, జూన్ 20: డయేరియా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. గురువారం ఆమె బెండపూడిలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులను పరామర్శించారు. ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉందని మెరుగైన వైద్యం అందిస్తున్నందున ధైర్యంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో కొమ్మనాపల్లి, బెండపూడి గ్రామాల్లో వ్యాధి వ్యాప్తి చెందినందున అన్నిశాఖల సమన్వయంతో వ్యాధిని అదుపులోకి తీసుకురాగాలిగామన్నారు. బెండపూడిలో మొదటి రోజు ఎక్కువ కేసులు నమోదైనా గురువారంనాటికి అవి మూడుకు తగ్గాయన్నారు. కొమ్మనాపల్లిలో ఎటువంటి కేసులు నమోదు కాలేదన్నారు. వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి ఏకొద్దిపాటి నలతగా ఉన్నా శిబిరంలో వైద్యం అందించాలన్నారు. తాగునీటి వనరులను శుభ్రపర్చడం, లీకులను అరికట్టడం చేయాలన్నారు. ప్రజల్లో పరిసరాల పరిశుభ్రత, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగించాలన్నారు. శిబిరాన్ని మరికొంతకాలం కొనసాగించి వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయించి పరిశుభ్రమైన తాగునీటిని మాత్రమే సరఫరా చేయాలన్నారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్యకార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్థానికంగా సాధ్యంకాని కేసులను తక్షణం కాకినాడ లేదా తుని చికిత్స నిమిత్తం పంపించాలన్నారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో డయేరియా వ్యాధి వ్యాప్తికి సంబంధించిన పరిస్థితిని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సరితను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సీనియర్ నేత యనమల రాజేష్, అరిగెల నర్సింహమూర్తి, సాధనాల నూకరాజు, యర్రబ్బు, కొంగర విశాలాక్షి, బూసాల శ్రీను, తుని మాజీ మున్సిపల్ ఛైర్మన్ కుసుమంచి శోభారాణి, గోపి, శివ పాల్గొన్నారు.

వ్యాధులపట్ల అవగాహన ఉండాలి

తునిరూరల్, జూన్ 20: సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కలిగి ఉండాలని తుని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు స్పష్టం చేశారు. శానిటేషన్ సిబ్బందితో కలిసి పట్టణంలో 17వ వార్డులో పట్టణవాసులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.

దుర్గాడలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్


శానిటేషన్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో అన్నామణి

గొల్లప్రోలు రూరల్, జూన్ 20: గొల్లప్రోలు మండలం దుర్గాడలో డయేరియా జాడలు కనిపించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కాకినాడ డివిజనల్ పంచాయతీ అధికారి అన్నామణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రత్నకుమార్‌లు గ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. వీధులు, డ్రెయిన్లను శుభ్రపరిచారు. తాగునీటి శాంపిల్స్‌ను సేకరించారు. గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహించాలని డీఐవో సూచించారు. ఎంపీడీవో జయప్రకాశరావు గ్రామంలో పర్యటించారు. వీరి వెంట చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ తులసి, పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర తదితరులు ఉన్నారు.

దుర్గాడలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

గొల్లప్రోలు మండలం దుర్గాడలో తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ నాయకులు గురువారం గొల్లప్రోలు ఎంపీడీవో జయప్రకాశరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ జలసిరి ద్వారా సురక్షిత తాగునీరు అందించే మినరల్ వాటర్‌ప్లాంటు ఏడాది క్రితం మూతబడిందన్నారు. దీనిపై తాము ఆందోళన నిర్వహించగా, మరమ్మతులు నిర్వహిస్తామని చెప్పి వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. దీని వలన ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణం దీనిని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా దుర్గాడలో డయేరియా కేసులు వస్తున్నందున పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మడికి ప్రసాద్, గొల్లపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం కావాలి: ఎంపీడీవో

సామర్లకోట, జూన్ 20:ప్రస్తుత వర్షాకాల సీజన్ కావడంతో కాలానుగుణంగా వ్యాప్తిచెందే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తం అయ్యేందుకు పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల అధికారులు శ్రద్ధ వహించాలని సామర్లకోట ఎంపీడీవో శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. సామర్లకోట మండలం ఉండూరు, మాధవపట్నం, తదితర గ్రామాలలో ప్రజలకు పంచాయతీ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి పైప్‌లైన్ లీకులను పంచాయతీ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. గ్రామాలలో క్లోరినేషన్ చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టేలా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పర్యవేక్షించాలని ఎంపీడీవో తెలిపారు.

రైతులు ఆనందంగా ఉంటే రాష్ట్రం సుభిక్షం

● ఎమ్మెల్యే యనమల దివ్య

తుని రూరల్, జూన్ 20: రైతు ఆనందంగా ఉంటే రాష్ట్రం సుభిక్షం అవుతుందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. ఖరీఫ్ రైతులకు విత్తనాలు పంపిణీ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అధికారులు తేటగుంటలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దివ్య హాజరై రైతులనుద్దేశించి ప్రసంగించారు. ఆధునికతను అందిపుచ్చుకుని వ్యవసాయంలో మెరుగైన దిగుబడులు సాధించడం ఈ ప్రాంత రైతులకు మంచి గుర్తింపు ఉందని రైతులను ప్రోత్సహించే దిశగా ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. టీడీపీ యువనేత యనమల రాజేష్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి)మాట్లాడుతూ శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే దివ్య చొరవతో నియోజకవర్గంలో రైతును అన్నివిధాలా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు కొయ్యా శ్రీనుబాబు, చోడిశెట్టి గణేష్, మోతుకూరి వెంకటేష్, దూలం మాణిక్యం, ఎంపీపీ బి.రాము, కరప అప్పారావు, జిక్కాన రామునాయుడు, తేటగుంట మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, చోడరాజు చిరంజీవిరాజు, కొల్లు సత్యనారాయణ, గజ్జి రాంబాబు, చామంతి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

23న టీడీపీ విజయోత్సవ సభ

తుని నియోజకవర్గంలో కూటమి ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య చారిత్రాత్మక విజయం అందుకున్న శుభ సందర్భంగా ఎన్డీయే కూటమి సభ్యులు ఏర్పాటుచేసిన విజయోత్సవ సభను ప్రజలు విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను తెలిపారు. ఈ సందర్భంగా తేటగుంట టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటుచేసిన టీడీపీ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి అబ్బాయి, ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణిలు మాట్లాడుతూ ఈనెల 23న పట్టణంలో విజయోత్సవ సంబరాలు జరుగుతాయన్నారు. తుని టీడీపీ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే యనమల దివ్య కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో భారీ విజయోత్సవం ర్యాలీలో పాల్గొంటారు.

'చొల్లంగి భూములను స్థానికులకు పంచాలి'

తాళ్లరేవు, జూన్ 20: చొల్లంగి సాల్ట్ భూములను అర్హులైన స్థానికులకు పంపిణీ చేయాలని టీడీపీ నేతలు మేడపాటి దేవానందం, పులపకూర చినబాబులు డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన ఎమ్మెల్యేలు వారి కార్యకర్తలకు, వేరే నియోజకవర్గమైన ఉప్పలంక గ్రామస్తులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నించగా 45 రోజులు ప్రజాఉద్యమం చేసి నిలుపుకున్నామన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామని టీడీపీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యేదాట్ల కాకినాడ జిల్లా కలెక్టరు జె.నివాస్‌తో చర్చించినట్లు తెలిపారు.

పేదల భూమిని ఆక్రమించుకున్న వ్యక్తులపై చర్యలకు డిమాండ్

కొత్తపల్లి, జూన్ 20: కొండెవరం శివారు శొంటివారిపాకల్లో పేదలు జీవనోపాధి పొందే చెరువు ఆక్రమించుకొని నివాసం ఉంటున్న పాకల ను తొలగించిన వ్యక్తులపై చర్యలు చేపట్టాలని సీపీఐ కొత్తపల్లి మండల నాయకుడు సాకా రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ తహీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

రేపూరులో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న జనసైనికులు

కాకినాడరూరల్, జూన్ 20: రూరల్ మండలం రేపూరులో జనసేననాయకులు ముమ్మిడి వెంకటేశ్వరరావు (బుజ్జి) పుట్టిన రోజు సందర్భంగా గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కాకినాడరూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా సుమారు 50 మంది జనసైనికులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శిరం గుశ్రీనివాసరావు, పాండ్రంకి రాజు, పంతం సందీప్, జి.శ్రీరాములు, టి.వేణు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

సర్పవరం జంక్షన్, జూన్ 20: కాకినాడ రూరల్ మండలం వలసపాకల గంగరాజు నగర్ కనకమహాలక్ష్మి టెంట్‌హౌస్‌వద్ద కాకతీయ సేవా సమితి సభ్యులు బొడ్డు బాపిరాజు కుమారబాబు, రామారావు రామరాయచౌదరి, కృష్ణార్జునచౌదరిల ఆధ్వర్యంలో రామోజీరావు సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు నేమాని కుమారబాబు, సూర్యదేవర రామారావు, రాయపాటి రామారాయ చౌదరి, బిక్కిన కృష్ణార్జునచౌదరి తదితరులు పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయం రహదారిలో జిల్లా కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో రామోజీరావు సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పూడికతీతలు ప్రారంభం

జగ్గంపేట, జూన్20: మండలంలోని శెట్టిబలిజపేటలో ఉన్న మెయిన్ డ్రెయిన్ పూడికతీత పనుల ను టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ గురువారం ప్రారంభించారు. అనంతరం జీను మణిబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు మాట్లాడారు. గ్రామాల్లో పర్యటించినప్పుడు వివరించిన ప్రజాసమస్యలను ఒక్కొక్కటిగా తీర్చడంలో భాగంగా శెట్టిబలజపేట లో పూడికతీత పనులను ప్రారంభించామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో మారిశెట్టి బద్రం, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, బుర్రి సత్తిబాబు, బచ్చల సుధీర్, పీలా మహేష్, కురు మళ్ల నాగేశ్వరరావు, నేదూరి గణేష్, తోలుగంటి ప్రవీణ్‌రెడ్డి, నండ్ల చిరంజీవి, రీస్ రమణ, కొండ్రుతూ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

'డాక్యుమెంట్లతో రుణాలు పొంది మోసపోవద్దు'

ప్రత్తిపాడు, జూన్20: భూములు, ఇతర స్థిరాస్తుల డాక్యుమెంట్లతో రుణాలు పొంది ఫైనాన్షియర్ల మోసాలకు బలికావద్దని కాకినాడ జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి కోరారు. చినశంకర్లపూడి గ్రామంలో గురువారం డాక్యుమెంట్లతో రుణాలు పొందడంవల్ల జరుగుతున్న మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

స్కిల్ ఇండియా డిజిటల్ ఎగ్జామ్స్ కోసం మాక్‌డ్రిల్

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 20: స్కిల్ ఇండియా డిజిటల్ ఎగ్జామినేషన్ మాడ్యూల్‌లో మార్పులు చేయడానికి వాటిని జాతీయస్థాయిలో అమలు చేయడానికి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ట్రైనింగ్ డైరెక్టర్ సీహెచ్‌ఎస్‌ఎన్ మూర్తి, డింగ్రా, ఉపాధి కల్పనా శిక్షణ శాఖ సంయుక్త సంచాలకులు ఎస్.సత్యనారాయణ, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం రెండు రోజులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మొదలైన అడ్మిషన్లు

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో ప్రవేశం కోసం ఈనెల 25వతేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. మొదటిరోజు కౌన్సెలింగ్‌లో 155మందికి వివిధ ఐటీఐల్లో సీట్లు కేటాయించినట్లు ప్రిన్సిపాల్ వర్మ తెలిపారు.

రెవెన్యూ మంత్రిని కలిసిన డాక్టర్ మల్లాడి

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 20: రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్లు, స్టాంపులు శాఖామంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అనగానీని కాకినాడ పార్లమెంటు జనసేన పార్టీ ఎన్నికల కమిటీ సభ్యుడు డాక్టర్ మల్లాడి రాజేంద్రప్రసాద్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పిఠాపురం, జూన్ 20: పిఠాపురం పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.ప్రభాకర్ తెలిపారు. పిఠాపురం సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ ఆదర్శఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్లు కొట్టేందుకు గానూ ఉదయం 7గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఈ కారణంగా అగ్రహారం, కోర్టులు, పశువుల సంత, హైవే పెట్రోల్ బంకు, మెట్ట ఏరియా, దత్తాత్రేయ గుడి, కుమ్మరి వీధి, తారకరామనగర్, వైఎస్ఆర్ గార్డెన్స్, బొజ్జా వారి తోట, మాధవపురం రోడ్డు, లయన్స్ కల్యాణమండపం ఏరియా, అన్నపూర్ణథియేటర్, మాధవనగర్, సాయిదత్త నగర్, బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ కార్యాలయం వీధులు, రామా థియేటర్ సెంటర్, డ్రైవర్స్‌కాలనీ, అయితేనగర్, మోహన్‌నగర్, కొత్తకొంపలు, ఏడుకాలువలు, గోర్స రోడ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

'గిరజనాపురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలి'

ప్రత్తిపాడు, జూన్ 20: ప్రత్తిపాడు మండలం గోకవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఎతైన కొండలపై ఉన్న గిరజనాపురం గ్రామ తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించాలని ఆ గ్రామ గిరిజనులు కోరారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి కమిటీ ఆధ్వర్యంలో గిరిజనులు స్థానిక ఎంపీడీవో డేవిడ్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. గిరిజనాపురంలో గత నెలరోజులుగా తాగు నీటి ఇబ్బందులు తీవ్రంగా నెలకొన్నాయని, గిరిజనులు కొండ జలధారలు సేవించి అనారోగ్యం పాలవుతున్నారని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు తెలిపారు.

'రెడ్డి నాయుడు సేవలు మరపురానివి'

ప్రత్తిపాడు, జూన్ 20: రెండువేల నాటక కళాప్రదర్శనలు ఇచ్చిన కళాకారుడు ఎ.రెడ్డినాయుడు సేవలు మరుపురానివని పలువురు సీనియర్ కళాకారులు నివాళులర్పించారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఆకస్మికంగా మృతి చెందిన రెడ్డి నాయుడుకు గురువారం వీరవెంకట విజయదుర్గ నాట్యమండలి ఆధ్వర్యంలో సంతాప సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు నాగులాపల్లి ఏసుబాబు, జ్యోతుల అప్పారావు, బొజ్జ గోవిందు, భైరా రాజు తదితరులు పాల్గొని రెడ్డి నాయుడు సేవలు కొనియాడి సంతాపం తెలిపారు.

'బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం'

సామర్లకోట, జూన్ 20: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం అని ఇందుకు ఎవరైనా బాధ్యులున్నా, ప్రోత్సహించినా వారిపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంటుందని పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో జీ.ఉషా పేర్కొన్నారు. బేటీ బచావో బేటీ పడావో పేరిట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో స్థానిక బ్రౌన్‌పేట సెక్టార్ పరిధి పెన్షన్ లైన్‌లో గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్ ఏ. మంగ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాల్యవివాహాలపై కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది ఎస్‌కె. ఫాతిమా, పుష్పరాజ్యం, వనజ, చిట్టెమ్మ, అమ్ములు, సౌదామిని, ఎంఎస్కె. లలిత తదితర తల్లులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం, జూన్ 20: మహిళా శక్తి సంఘాల సభ్యులు ఆర్థికంగా ప్రగతి సాధించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. మండల కేంద్రం ఏలేశ్వరంలో మహిళాశక్తి సంఘాల సమావేశం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. మహిళా సంఘం సభ్యులు ఎంపీపీ బుజ్జి, మాజీ సొసైటీ అధ్యక్షులు చిక్కాల లక్ష్మణరావులను సత్కరించారు.

ఎన్డీఏ కూటమితో సుపరిపాలన సాధ్యం: తుమ్మల బాబు

సామర్లకోట, జూన్ 20: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వ పాలనతో అన్నివర్గాల ప్రజలను ఆకట్టుకునే సుపరిపాలన సాధ్యపడుతుందని జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు పేర్కొ న్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కూటమి పార్టీలు ఘనవిజయం సాధించిన శుభ సందర్భంగా సామర్లకోట పట్టణ జనసేన నాయకులు, కార్యకర్తలు గణపతినగరం సాయిబాబు ఆలయం వద్ద గురువారం మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా తుమ్మల బాబు హాజరై ఆలయంవద్ద 108 కొబ్బరికాయలు కొట్టి కార్యకర్తల మొక్కుతీర్చారు. సరోజా వాసు, మంచెం సాయిబాబు, అత్తిలి కృష్ణ, పి.జానకిరామారావు, పెంకే వెంకటలక్ష్మి, కందా రమేష్, కాపా వీరబాబు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌కు సత్యప్రభ సత్కారం



ప్రత్తిపాడు, జూన్20: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీ రాజ్ శాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టిన జనసేన అధినేత కొణిదెల పవన్‌కల్యాణ్‌ను గురువారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఘనంగా సన్మానించారు. విజయవాడలోని డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయానికి సత్యప్రభ వెళ్లి పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి మంత్రిగా సహకరించాలని ఆమె పవన్‌కల్యాణ్‌ను కోరారు. పవన్‌ను కలిసిన అభినందించిన వారిలో సత్యప్రభ తనయుడు సాయితర్షిత్, కుమార్తె సత్యమాధురి, కుటుంబ సభ్యులు ఉన్నారు.

అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘాపెట్టాలి : ఆర్డీవో

కాకినాడ సిటీ, జూన్ 20: అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలని ఆర్డీవో కిషోర్ ఆదేశించారు. కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గురువారం ఆర్‌డీవో ఇట్ల కిషోర్ వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీశిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సబ్ జిల్లా లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియెట్ అథారిటీ, డివి జన్ స్థాయి పీసీ, సీఎస్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కిషోర్ మా ట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధిం చిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘాపెట్టాలన్నారు. అల్ట్రాసౌండ్ వైద్యపరీక్షలు లింగనిర్ధారణకు ఉపయో గించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాకినాడ డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 112 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆశవర్కర్లు సంయుక్తంగా గర్భిణుల గృహాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఐవో రత్నకుమార్, జీజీహెచ్ రేడియాలజిస్టు హరిత, పిడీయాట్రిషన్ కీర్తిప్రియా, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు పాల్గొన్నారు.

'రైతు భరోసా కేంద్రాల్లో పని కల్పించాలి'

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 20: రైతు భరోసా కేంద్రాల్లో ఉద్యోగులకు ప్రభుత్వం వాగ్దానం చేసిన మేరకు ఏడాదిలో 11నెలలు పని కల్పించాలని బీజేపీ డిమాండ్ చేసింది. గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లకు కేవలం ఏడాదిలో రెండు నెలలు మాత్రమే పని కల్పించడంవల్ల మిగతా నెలలు పనిలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, మీడియా ప్యాలెస్ దువ్వూరి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్‌కు వినతిపత్రాలు పంపించారు.

కొలువుదీరిన చేనేత వస్త్రాల ప్రదర్శన

● ఆకట్టుకుంటున్న స్టాళ్లు.. రేపటి వరకు అమ్మకాలు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 20: చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో కాకినాడ భానుగుడి జంక్షన్ ఓల్డ్ మీసేవా ఎస్పీ ఆఫీసు పక్కన కాకినాడ బిల్డింగ్స్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేసింది. 16న ప్రారంభమైన ఈ ప్రదర్శన ఈనెల 22వరకు ఉంటుంది. రాష్ట్రంలో 8 జిల్లాలకు చెందిన చేనేత కార్మికులు తయారు చేసిన ఉత్పత్తులను 18 స్టాల్స్‌లో ఏర్పాటు చేశారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉండడంతో పాటు అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే ధరలను నిర్ణయించారు. ప్రదర్శనలో వివిధ ప్రాంతాల చేనేత వస్త్ర ప్రదర్శన అమ్మకాలు జరుగుతున్నాయి.

చేనేత కార్మికులను ప్రోత్సహించండి

● ఎ.పెద్దిరాజు, జిల్లా చేనేత జౌళి అధికారి

చేనేత కార్మికులు మగ్గాల ద్వారా తయారుచేసిన చేనేత వస్త్రాలను చేనేత సహకార సంఘాలు ద్వారా నేరుగా వినియోగదారుడికి ఇలాంటి ఎగ్జిబిషన్ ద్వారా అందుబాటులోకి తీసుకురావడంతో తక్కువ ధరకే లభిస్తున్నాయి. వినియోగదారులకు చేనేత వస్త్రాలు తక్కువ ధరకే అందడంతోపాటు కార్మికులకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయి. చేనేతకార్మికులను ప్రోత్సహించాలి. ఈఉద్దేశ్యంతోనే ఎగ్జిబిషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.

నూతన ప్రభుత్వానికి సహకారం అందిస్తాం

● ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ పితాని త్రినాథ్


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 20: నూతన ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఏపీజేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ పితాని త్రినాథ్ తెలిపారు. రెవెన్యూ డే సందర్భంగా కాకినాడ ముద్దాడ రవిచంద్ర రెవెన్యూ భవన్‌లో గురువారం రెవెన్యూ ఉద్యోగులు పెద్దఎత్తున హాజరై కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు సత్కార కార్యక్రమాలు నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్ లావణ్య, జేఏసీ అమరావతి మహిళ విభాగం ఛైర్మన్ సంధ్యారాణి, ఏపీ రెవెన్యూ సర్వీ సెస్ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్ సుబ్బారావు, విజయ్, దుర్గాప్రసాద్, రవిచంద్ర, రమ్య పాల్గొన్నారు.

రౌతులపూడి ఎస్ఐకి పదోన్నతి


అబ్దుల్ నబీని అభినందిస్తున్న ఎస్పీ

రౌతులపూడి, జూన్ 20: రౌతులపూడి ఎస్ఐగా పనిచేస్తున్న మహమ్మద్ అబ్దుల్‌నబీకి సీఐగా పదోన్నతి లభించింది. ఆయన బదిలీ అయ్యారు. ఎస్పీ సతీష్‌కు మార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

సీపీఎఫ్ వద్ద కార్మికుల ఆందోళన

ఏలేశ్వరం, జూన్ 20: సీపీఎఫ్ పరిశ్రమవద్ద కార్మికులు ఆందోళన చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం సీపీఎఫ్ కంపెనీలో పనిచేస్తున్న 71 మందిని, కాంట్రాక్ట్ ఉద్యోగులు 150 మందిని ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడంపై గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో యర్రవరం సీపీఎఫ్ పరిశ్రమవద్ద ఆందోళన చేపట్టారు. యాజమాన్యం స్పందించి వెంటనే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కంచం రామకృష్ణ, బోకన రాంబాబు, ఎస్.వి. నాయుడు, నాగలక్ష్మీ, ఎల్.భవాని, జగదీశ్వరి, పద్మ నిరసన తెలిపారు. సంఘటనా స్థలానికి సీఐ శేఖర్‌బాబు చేరుకుని కార్మికులతో మాట్లాడి తమ డిమాండ్‌లను యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరిస్తానని ఆందోళన విరమించుకోవాలని కోరారు.